

సత్తాచాటిన బౌలర్లు 8 లో..

నేటి ప్రభాత

# సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784

## రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

**అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.**

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.

9100900918
9100900931

ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | ఆదివారం | 03- 08- 2025 | సంపుటి : 1 | సంచిక : 62 | పేజీలు : 8 | వెల : 4/-




# ప్రపంచంతో పోటీపడాలి

- క్రీడల్లో తెలంగాణ యువత రాణించాలి
- చదువుతో పాటు ఆటల్లోనూ మేటి కావాలి
- యువత పెడదోవపట్టకుండా క్రీడల్లో ప్రోత్సాహం
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని ఆవిష్కరించిన సీఎం రేవంత్

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా విధానం లేకపోవడం వల్ల పట్టణ ప్రాంతాల్లోని యువత పెడదోవ పడుతున్నారని, క్రీడలను ప్రోత్సహించక పోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్‌కాంక్లేవ్‌లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంతో పోటీపడే మనం.. క్రీడల్లో వెనకబడి ఉండడం బాగాలేదన్నారు. భారత్‌కు బలమైన క్రీడా వేదిక కావాలని అందులో తెలంగాణ ప్రధా నంగా ఉండాలని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నామని.. యువతకు దశ దిశా లేకపోవడం బాధాకరమని అన్నారు. వ్యసనాల రూపంలో మనవైపు వేగంగా ప్రమాదం దూసుకొస్తుందని అన్నారు. ఓ విధానం లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని.. అందుకే నూతన క్రీడావిధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు. క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని భావిస్తున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పై స్పోర్ట్స్ చాప్టర్ పెడతామని అన్నారు. 1956లో ఫుట్ బాల్ టీంలో మనవాళ్ళు 9 మంది ఉండేవారని.. క్రీడల్లో హైదరాబాద్ కు మంచి పేరు ఉండేదని అన్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో రాణించినవారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. చదువుల్లోనే కాదు, క్రీడల్లోనూ

మిగతా 2వ పేజీలో..

## దళిత, ఆదివాసీల సంక్షేమానికి కృషి



- సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
- దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
- పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
- రాహుల్‌ను ప్రధానిని చేస్తామని తెలంగాణ పక్షాన హామీ
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- మోడీని గద్దెదించడం రాహుల్‌కు మాత్రమే సాధ్యం
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

2 లో..



2 లో..

## రేవణ్ణకు జీవిత ఖైదు

- పదిలక్షల పరిహారం కూడా చెల్లించాలని ఆదేశం
- ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు



3 లో..

## కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్

- కెటిఆర్ పరువునష్టం కేసులో క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశం

ట్రంప్ చెంపఛెళ్లుమనిపించిన

## ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్



- డెడ్ ఎకానమీ అంటూ చేసిన ప్రకటనపై ఎఐ దిమ్మతిరిగే సమాధానం

4 లో..

# కాళేశ్వరం కేసులో కెసిఆర్ పక్కా దోషి

- కమిషన్ విచారణలో అదే తేలింది
- సొంత లాభం కోసం లక్షకోట్లు వృధా చేసిన కెసిఆర్
- అందుకు మూల్యం చెల్లించక తప్పదు
- పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్



**సంగారెడ్డి- నేటి ప్రభాత సూర్య :**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆందోలు

మిగతా 4వ పేజీలో..

# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

- బిజెపికి అనుకూలంగా ఎన్నికల సంఘం పనితీరు
- దాని ఆధారాలు తమవద్ద ఉన్నాయి
- తాము అధికారంలోకి వచ్చాక దేనినీ వదలం
- అధికారులు రిటైర్ అయినా పట్టుకుని శిక్షిస్తాం
- కాంగ్రెస్ న్యాయ సమీక్ష సదస్సులో రాహుల్



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

మొన్నటిలోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్షిక న్యాయ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం న్యాయ సమ్మతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు-తమ వద్ద ఉన్నాయని

మిగతా 2వ పేజీలో..

# బనకచర్లపై లోకేశ్‌కు అవగాహన లేమి

- మిగులు జలాల గురించి అప్పుడే ఎలా తేలుస్తారు
- కెటిఆర్‌తో రహస్య భేటీ తరవాతనే తెరపైకి బనకచర్ల
- డిప్యూటి సిఎం భట్టి సంచలన వ్యాఖ్యలు



**కొల్లాపూర్- నేటి ప్రభాత సూర్య :**

బనకచర్లపై లోకేశ్ తదితర మంత్రుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అసలు జలాలకే మోక్షం లేదంటే ఇక మిగులు జలాలు ఎక్కడివని అన్నారు. తెలంగాణ వినియోగించుకోగా వచ్చిన నీళ్లు వాడుకుంటామని అంటున్నారని, అది ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. పోలవరం లాంటి ప్రాజెక్టును పూర్తి చేయలేక పోతున్నారని అంటూ..ముందు దాని సంగతి చూడాలన్నారు. ఎపి మంత్రులు బనకచర్ల విషయంలో చేస్తున్న

మిగతా 2వ పేజీలో..



పార్లమెంట్ సాక్షిగా

## యూరియాపై తప్పుడు లెక్కలు

- ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
- కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ

4 లో..



## అర్హులకు కొత్త రేషన్ కార్డులు

- సన్నబియ్యంతో ఖజానాపై రూ. 3 వేల కోట్ల భారం
- సంక్షేమం, అభివృద్ధిలో వెనక్కి తగ్గేది లేదు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

3 లో..

# బిసి రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

- 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలి
- కామారెడ్డి డిక్లరేషన్‌కు ఎందుకు కట్టుబడలేదు
- ముస్లిం రిజర్వేషన్లతో బిసిల కోటాకు గండి
- కేంద్రం, బిజెపిలపై నెపం నెట్టి తప్పించుకునే యత్నం
- ఇందిరాపార్క్ వద్ద సభలో బిజెపి నేతల డిమాండ్

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. ఇందిరా పార్క్ వద్ద జరిగిన ధర్నాలో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని



మిగతా 2వ పేజీలో..

# రిజిస్ట్రేషన్ ఆఫీసుల పునర్వ్యవస్థీకరణ

- కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు
- నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ భవనాలు
- గచ్చిబౌలిలో భవన శంకుస్థాపన
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీ కరించడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో

మిగతా 3వ పేజీలో..

# చెరువు, కుంటలు కాపాడాలి

- మంత్రి ఉత్తమ్‌తో రైతు కమిషన్ భేటీ
- రైతు కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం ఏర్పాటు
- సమావేశానికి హాజరు కావాలని మంత్రికి విజ్ఞప్తి
- సమగ్ర పాలసీతోనే చెరువులు, కుంటల అభివృద్ధి: ఉత్తమ్



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

రాష్ట్ర సచివాలయంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో రైతు కమిషన్ భేటీ అయ్యింది. ఈ భేటీలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి వున్నారు. ఇప్పటి వరకు రైతు కమిషన్ చేసిన కార్యక్రమాలను వివరించడంతో పాటు రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై మంత్రికి కమిషన్ సూచనలు చేసింది. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలనీ చెప్పింది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేసింది. గ్రామీణ స్థాయిలో రైతులు

మిగతా 2వ పేజీలో..



2 లో..

## 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

- వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ




## యువతను క్రీడల వైపు మళ్లిస్తున్నాం

4 లో..

# అత్యాచారం కేసులో రేవణ్ణకు జీవిత ఖైదు

- పదిలక్షల పరిహారం కూడా చెల్లించాలని ఆదేశం
- ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు



**బెంగళూరు- నేటి ప్రభాత సూర్య :**


ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో మాజీప్రధాని దేవేగౌడ మనవడు, హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు పడింది. దీంతో పాటు రూ.10లక్షల జరిమానా విధిస్తూ బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే.. రేవణ్ణను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. ఆగస్టు 1న తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న శెనరసీపుర ఠాణాలో ప్రజ్వన్ రేవణ్ణపై ఫిర్యాదు చేయడంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉండగా తాజాగా శిక్ష ఖరారైంది. అత్యాచారం కేసులో శనివారం కోర్టు ఆయనకు ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించింది. అత్యాచారం, లైంగిక వేధింపులు, సాక్ష్యాలను నాశనం చేయడం, అత్యాచారానికి సంబంధించిన వీడియోలను సర్క్యులేట్ చేయడం వంటి ఆరోపణలపై దోషిగా తేలడంతో రేవణ్ణకు జీవిత ఖైదుతోపాటు కోర్టు రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. లైంగిక వేధింపులు, అత్యాచారం సమయంలో వీడియోలను రికార్డ్ చేశాడని.. ఎవరికైనా చెబితే ఆ వీడియోలను విడుదల చేస్తానని బెదిరించాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.



# 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

**వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ**

**వారణాసి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా విడుదల చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ.2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు. వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ కర్యక్రమంలో సిఎం యోగి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైలం వద్ద తగ్గుతున్న వరద ప్రవాహం

**నంద్యాల :** శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. మరోవైపు సాగర్ వద్ద కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం వద్ద నీరు తగ్గడంతో ఒక గేటు మూసివేసి.. ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 2,74,254 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ఇక్కడి నుంచి ఔట్‌లో 2,73,632 క్యూసెక్కులుగా ఉంది. 7 స్పిల్ వే గేట్ల ద్వారా 1,87,530 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,787 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 200.19 టీఎంసీలుగా నమోదైంది.

# దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి

- సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
- దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
- పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
- రాహుల్‌ను ప్రధానిని చేస్తామని తెలంగాణ పక్షాన హామీ
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- మోడీని గద్దెదించడం కేవలం రాహుల్‌కు మాత్రమే సాధ్యం
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా,గెలిచినా ప్రజల మధ్యే ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని,11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించ ట్లేదని అన్నారు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు. 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయిననప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అద్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాటం విజయవంతం కాబోతుందని అన్నారు. దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని, రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదని, దేశానికి మార్గదర్శనం కోసం మనుసింఘ్వీ నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. మోడీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోడీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. మోడీని ఓడిస్తాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామన్నారు. మాది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. పాకిస్థాన్ ను ఇందిరా గాంధీ రెండు ముక్కలు చేశారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అని కొనియాడారు.

# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్



మొదటిపేజీ తరువాయి..

అన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు. ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడించారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు- గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పుడైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధానసభకు ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మరోమారు భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ రాహుల్ గాంధీమరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. ఎన్నికల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమవద్ద ఉన్నాయని.. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా జరిగిందనే విషయాన్ని త్వరలోనే తాము ప్రజల ముందు నిరూపిస్తామని పేర్కొన్నారు. తాము బయటపెట్టే నిజంతో ఈసీ (ఊఈ) పునాదులు కదిలిపోతాయన్నారు. ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న ఎన్నికల కమిషన్ అధికారులు పదవీవిరమణ చేసినా కూడా వారిని వదలమని హెచ్చరించారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన.. దాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. కాగా ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలేనని.. రాహుల్ లాంటి వారు చేస్తోన్న బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదని తెలిపింది.

# ప్రపంచంతో పోటీ పడాలి

మొదటిపేజీ తరువాయి..

రాణిస్తే ఉద్యోగం ఇస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడా నైపుణ్యానికి కొదవ లేదని అన్నారు. ఇప్పుడు స్టేడియంలు ఫంక్షన్ హాల్స్ గా మారాయని అన్నారు. ఒలంపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ కూడా రాకపోవడం సిగ్గు అనిపిస్తోందని అన్నారు. మనకంటే చాలా చిన్న దేశాలు క్రీడల్లో రాణిస్తున్నాయని అన్నారు. ఇటీవల సౌత్ కొరియాను సందర్శించామని.. అక్కడ స్పోర్ట్స్ వర్సిటీలో చదివినోళ్లే గోల్డ్ మెడల్స్ కొట్టారని అన్నారు. చైతన్యానికి పోరాటానికి మారుపేరైన తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నిలబడి పోరాటం చేసిన యువత నేడు దశ దిశా లేకుండా.. ప్రభుత్వాలకు సరైన విధానాలు లేకపోవడం వల్ల వ్యసనాల వైపు వేగంగా ప్రయాణిస్తున్నారని అన్నారు. పోరాట స్ఫూర్తి, చైతన్యం ఉన్న ఈ ప్రాంతం క్రీడల్లో రాణించాలని, దేశానికి గొప్ప పేరు తేవాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రానికి క్రీడావిధానం ఉండాలని, క్రీడా విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలని, క్రీడాకారుల స్ఫూర్తిని పెంచాలని పబ్లిక్ ప్రైవేట్ ప్పార్టర్ షిప్ తో నూతన క్రీడా విధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు.

# బనకచర్లపై లోకేశ్‌కు అవగాహన లేమి

మొదటిపేజీ తరువాయి..



ప్రకటనలు వాస్తవ విరుద్ధమన్నారు, ఇకపోతే కెటిఆర్ లోకేశ్ కలిసిన తరవాతనే లోకేశ్ బనకచర్ల గురించి మాట్లాడుతున్నారన్నారు. ఈ ఇద్దరి మధ్య చీకట్లో ఏ ఒప్పందం కుదరిందో చెప్పాన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ- సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు-చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కృష్ణా నదిపై గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు న్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదన్నారు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగిందన్నారు. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. మిగులు జలాలు ఉంటేకదా బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరఫున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నామని అన్నారు.

# బిసి రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

మొదటిపేజీ తరువాయి..

చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనేక విధాలుగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను పీఎం, సీఎంలను చేసిందా?అని ప్రశ్నించారు. బీసీలకు జనాభా సేకరణ తర్వాతే సామాజిక న్యాయం జరుగుతుంది. దిల్లీలో అనేక రకాలుగా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా నిర్వహించింది. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ నేతలు ఎండగట్టారు. బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు , బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గతంలో అమలైన 35 శాతం కంటే కూడా రెండు శాతం రిజర్వేషన్లు తగ్గించేలా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. 20శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు.



ఎస్సీ, ఎస్టీలో జనాభా పెరిగిందని బీసీల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారని తెలిపారు. 42 శాతం పూర్తిగా బీసీలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీల మెడలు కోసేలా ముస్లింలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేసిన పార్టీ బీజేపీ మాత్రమేనని ఉద్ఘాటించారు. గత 70 ఏళ్లలో కుల గణన ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కులగణన చేయని కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ పార్లమెంట్ ముందు ముక్కు నేలకు రాయాలని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విషయంలో మార్పు వచ్చిందో సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి నిలదీశారు. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కింద ముస్లిం, క్రిస్టియన్‌లకు రిజర్వేషన్‌లు కల్పిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ విషయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ ఏ విషయం లో ఆదర్శమో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాయలో మనం పడకూడదని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బీసీ సంఘాలు పోరాటం చేయాలని కోరారు. బీసీలకు బీజేపీ అండగా ఉంటు-ందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

బీసీ జనాభా సేకరణను కాంగ్రెస్ గతంలో ఎందుకు చేయలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ప్రయత్నిస్తూనే ఉందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కానీ బీసీ నేతను ముఖ్యమంత్రి చేశారా అని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పేరుతో రాజకీయం చేయాలని చూస్తోందని.. బీసీలకు ఎక్కడ ప్రాధాన్యమిచ్చిందని నిలదీశారు. తొమ్మిది మంది కార్పొరేషన్ ఛైర్మన్లను నియమిస్తే ఒక్క బీసీ నేతకు మాత్రమే అవకాశమిచ్చారని విమర్శించారు. క్యాబినెట్‌లో కేవలం ముగ్గురు బీసీ మంత్రులు మాత్రమే ఉన్నారన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. 42 శాతం రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే ఇవ్వాలని, ఇతర మతాల వారిని కలపొద్దని డిమాండ్ చేశారు. బీసీల హక్కులను ఎంఐఎం పార్టీ హరిస్తోందని, కాంగ్రెస్ కాలరాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీలు పోరాడాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో అనేక అంశాలు ఉన్నాయని, స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో బీసీలకు 42 శాతం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ హయంలో బీసీ శాతం 23 కు పడిపోయిందని ఆయన మండిపడ్డారు. బీసీల కళ్లలో మట్టి కొట్టిన పార్టీ బీఆర్ఎస్ పార్టీఅని, బీఆర్ఎస్ పార్టీకి ఓబీసీ ల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన ఏకిపారేసారు.

# చెరువు, కుంటలు కాపాడాలి

మొదటిపేజీ తరువాయి..

సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించింది. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లే ఔట్లు- వేయడం, వాటర్ బాడీస్ కు వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని వివరించింది. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, గ్రౌండ్ వాటర్ లెవల్స్ పడిపోవడం జరిగిందని వివరించింది. రాష్ట్రంలో చెరువులు కాపాడుకుపడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ తెలిపింది. ఆ పాలసీని కమిషన్ తయారు చేయనున్నట్లు వివరించింది. నిపుణులతో పాలసీకి సంబంధించి ప్రసెంటేషన్ మీటింగ్ త్వరలో కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు.. ఆ సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకావాలని కమిషన్ కోరింది. కమిషన్ ఆహ్వానం కు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించినట్లు- కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్

## కెటిఆర్ పరువునష్టం కేసులో క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశం



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**
మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఫోన్ ట్యాంపింగ్, డ్రగ్స్, టాలీవుడ్ హీరోయిన్ సమంత విడాకుల వ్యవహారంలో కొండా సురేఖ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితురాలికి నోటీసు జారీ చేయాలని స్పష్టం చేసింది. కేటీఆర్‌పైన మంత్రి నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేటీఆర్ తరఫున న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన తర్వాత ఆదేశాలు జారీ చేసింది. నిందితురాలు కొండా సురేఖపై ప్రాథమిక కేసు ఉన్నట్లు నాంపల్లి కోర్టు గుర్తించింది.



# శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

**తిరుమల :** కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన గాయత్రి నిలయంలో బస చేశారు. ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి దగ్గరుండి దర్శనం చేయించారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

## తన ఓటు గల్లంతయ్యిందన్న తేజస్వీ

**పాట్నా :** బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడు తున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నా ఈపీఐసీ నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కన్పించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ లెవల్ అధికారి నావద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదని తేజస్వీ వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20వేల నుంచి 30వేల వరకు ఓటర్లను తొలగించాలని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు. అయితే, తేజస్వీయాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడీ నేత బహుశా తన పాత ఈపీఐసీ నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కన్పించకపోయి ఉండొచ్చని ఈసీ తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవటంతో ఈసీ ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు కల్పించింది. బిహార్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్నాయి.

# ప్రధాని మోడీ తదితరుల పేర్లు చెప్పాలని ఒత్తిడి

## మాలేగావ్ కేసులో నిర్దోషి ప్రజ్ఞా ఠాకూర్

**భోపాల్ :** మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. భాజపా సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ సహా పలువురి పేర్లు చెప్పాలని వారు నాపై ఒత్తిడి తెచ్చారు. నన్ను హింసించారు. నన్ను ఆసుపత్రిలో అక్రమంగా నిర్బంధించారు. నేను గుజరాత్‌లో నివసించడం వల్ల ప్రధాని మోదీ పేరు కూడా చెప్పించాలని చూశారు. నేను అబద్ధాలు చెప్పాలని వారు ప్రయత్నించారు. అవి అబద్ధాలు కావడంతో నేను ఎవరి పేరు చెప్పలేదని ప్రజ్ఞ మీడియాతో మాట్లాడారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీ-ఎస్ అధికారి మహబూబ్ ముజావ్ కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి తెలిసిందే. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు- మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు- చెప్పారు. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందితో పాటు- రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు- వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది.

## ప్రపంచ దేశాలలో

# అగ్రగామిగా భారత్



- బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- 140 కోట్ల మందికి ఉచితంగా కరోనా వ్యాక్సిన్
- రైతుల పక్షపాతి నరేంద్ర మోడీ
- ధనిక రాష్ట్రని అప్పులపాలు చేసిన బిఆర్‌యస్ పార్టీ
- తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించుకుందాం

**యాచారం నేటి ప్రభాత సూర్య :**
ప్రపంచ దేశాలలో అగ్రగామిగా ప్రధాని నరేంద్ర మోడీ నిలబెట్టాడని ,కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా రూ 20.500 కోట్లు, విడుదల రూ 9.7 కోట్ల రైతులకు ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20 విడత ద్వారా రైతుల ఖాతాలు జమ చేశారు. యాచారం మండల కేంద్రంలో రైతు వేదికలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, క్రీడాజ్యోతి డైరెక్టర్ వికె సింగ్, వ్యవసాయ జిల్లా శాఖ అధికారి డి ఉష, ఆర్డీవో అనంతరెడ్డి, ఎం హెచ్ చంద్రకాంత్ టీవీ చానల్ లో వీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో భారత్ మూడవ ఆర్థిక సంఘంగా అభివృద్ధి చెందుతుందని రైతు వేదికలో మాట్లాడారు. నాలుగో ఆర్థిక దేశంగా ఎదగడానికి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలు భారత వైపు చూస్తున్నాయని అన్నారు. దేశంలో అనేక మౌలిక వస్తువులు ఉత్పత్తి చేసుకుంటున్నామన్నారు. రక్షణ రంగం ప్రపంచ దేశాల్లో పోటు పడుతుందన్నారు. సింధూర పేరుతో ఉగ్రవాదాన్ని అంతం చేశామన్నారు.దేశాన్ని రక్షించుకోవడమే మోడీ ప్రభుత్వమని భరోసా ఇచ్చారు. మోడీ నాయకత్వం ఎవరి చేతిలో లేదని, మనం అడుక్కునే పరిస్థితుల్లో లేమని, మనమే ఇంకొక్క దేశానికి బిక్షం పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రకటించారు. కరోనాలో 140 కోట్ల మందికి ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చిన ఘనత నరేంద్ర మోడీదే, అమెరికా, జపాన్ ఇటలీ దేశాలకు కరోనా వ్యాక్సిన్ పంపిణీ చేసిన భారతదేశమని అన్నారు. ఈ దేశంలో రైతుల పక్షపాతిగా బిజెపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పాల ఉత్పత్తి బాగా పెరిగింది అన్నారు. ప్రపంచ దేశాలకు పాల పౌడర్ ను ఎగుమత్తు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ధాన్యం క్వింటలకు 1300 ఉండేది. ప్రస్తుతం రూ 2383 క్వింటాలకు కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం పరుస్తుందన్నారు. ఎరువుల ధర ఒక బస్తాకు 2,600 రూ, కానీ కేవలం 264 రూ,లకే కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. మహిళలకు 20 లక్షల వడ్డీ లేని రుణం మంజూరు కేంద్ర ప్రభుత్వం చేసింది. దేశంలో మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కోరారు.తెలంగాణ ఏర్పడినప్పుడు ధనిక రాష్ట్ర మని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పలుగా చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించుకునే బాధ్యత బిజెపి ప్రభుత్వానికి ఉందని భరోసా ఇచ్చారు. వ్యవసాయ అభివృద్ధిని, రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూడు విడత లుగా కిసాన్ పథకం ద్వారా 2వేల చొప్పున సంవత్సరానికి 6 వేలు రైతు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో రాధా రాణి, ఏవో రవి నాథ్, ఏఎంసి చైర్మన్ గురునాథ్ రెడ్డి, డైరెక్టర్లు మస్కు నరసింహ, గులాం అక్బర్, పిఏసిఎస్ చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి, కిసాన్ మోర్చా ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, కిసాన్ సేల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్, కే విజయ్ కుమార్, ఈసీ శేఖర్ మామ, బొక్క నర్సింహారెడ్డి, కొప్పు భాష, మాజీ ఎంపీపీ రాచర్ల, కొప్పు సుకన్య, వెంకటేశ్వర్లు, బిలకంటి శేఖర్ రెడ్డి, అందల శ్రీరాములు, అర్జున్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేరంగుల రాజు, కొండ మధుకర్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ కుమార్, తాంద్ర రవీందర్, మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు

- రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ
- సన్నబియ్యంతో ఖజానాపై రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారం
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో వెనక్కి తగ్గేది లేదు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



**పెద్దపల్లి- నేటి ప్రభాత సూర్య :**
మంథని నియోజకవర్గంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను రాష్ట్ర ఐటీ, మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్య ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీకి నాంది పలికింది. ప్రతి అర్హ కుటుంబం సకాలంలో సన్నబియ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సన్న బియ్యం సరఫరా సక్రమంగా జరిగేలా రెవెన్యూ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. సన్న బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల సుమారు రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు.మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి గుర్తుచేశారు. 'ఉచిత బస్ ప్రయాణం అమలు చేయడం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లను ఉపయోగించుకున్నారని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతీ నెల రూ. 6 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నప్పటికీ, సంక్షేమ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. మంథని అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్‌బాబు, త్వరలో మంథనిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అదనంగా, 10,200 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేసినట్లు- పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి. మంథనిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా కృతనిశ్చయం అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాప్రభుత్వం ప్రజల గౌరవాన్ని పెంచే ఆలోచన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతి నెల 7వేల కోట్ల వడ్డి కట్టాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నామన్నారు. ఎంత ఆర్థికభారమైనప్పటికీ ప్రభుత్వం భరించి ప్రజలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏమి చేస్తున్నదని అడిగే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం కూడా మీపై ఉన్నదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది మందికి రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సన్నబియ్యం అందించాలన్న ఆలోచన చేయడం జరిగిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గతపదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించ లేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించి దాదాపు 65వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 200 యూనిట్ల కరెంటు- ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పేద వారికి భారం ఎలా తగ్గించాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు.

# రిజిస్ట్రేషన్ ఆఫీసుల పునర్వ్యవస్థీకరణ

మొదటిపేజీ తరువాయి..

రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్ల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టు-కొని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకే చోట ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల , మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగారెడ్డి , పఠాన్‌చెరువు కలిపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పోరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడ డమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందన్నారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఒక రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఈ బిల్డింగ్ నమూనాకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# సంపాదకీయం

## ఎదురుదాడితో అక్రమాలను దాచలేము

ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధికారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు.

కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించుకోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్,హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది.

అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూళ్లో శిక్షణ పొంది వచ్చినవారు. ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది.ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు. ఒక ఉద్యమ పార్టీగా ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొర్రెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు. ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత.

కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది.అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజల ను నిందించడమే అవుతుంది. జగన్, కెటిఆర్‌లు ఇది గమనించాలి. ప్రజలను అవమానిస్తున్న ఈ నేతలను ప్రజలు దూరంగా పెట్టాలి. బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణకు సాధ్యమైనంత మోసం చేయమెలా అన్న రీతిలో పాలన సాగింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మేరకు అసలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది.రైతులు అప్పుల్లోనే ఉన్నారు, యువత నిరుద్యోగంలో ఉన్నారు. రుణమాఫీ రాయితీల పేరుతో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారు. పేపర్ లీకులు, గ్రూప్ పరీక్షల వాయిదాలు, పోలీస్ పరీక్షల గందరగోళం ఇవన్నీ యువత భవిష్యత్తును నాశనం చేశాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పు రూ. 6.5 లక్షల కోట్లకు చేరింది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇవన్నీ పేరుకి ప్రాజెక్టులు. కానీ అన్నీ అవినీతి పథకాలే. జేబులు నింపే పథకాలే. గ్రామాల్లోకి తాగునీరు, విద్య, ఆరోగ్య పరిరక్షణకు తీసుకున్నచర్యలు లేవు. ఇవన్నీ కూడా ఇక్కడ బిఆర్ఎస్‌కు ఎపిలో వైకాపాకు వర్తిస్తాయి.

# మోడీ స్వదేశీ వస్తు నినాదం

**వారణాసి- నేటి ప్రభాత సూర్య :**

భారత్ కూడా అతి త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారనుందని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోదీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదా స్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన చేసిన విమర్శలపై భారత ప్రధాని నరేంద్రమోదీ పరో క్షంగా స్పందించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయో జనాలపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంకట్టాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఇటీవల భారత్–రష్యా బంధంపై ట్రంప్ స్పందిస్తూ.. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చు కోనీయండని, కలిసి మునగనీయండని విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూఢిల్లీపై 25శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యాధినేత.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తే అదనంగా పెనాల్టీలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే మోదీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఇతర దేశాలపై ఆధార పడకుండా సాగాలి**

**ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు**





# ట్రంప్ చెంపఛెళ్లుమనిపించిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్

**డెడ్ ఎకానమి అంటూ చేసిన ప్రకటనపై ఎఐ దిమ్మతిరిగే సమాధానం**

**భారత్ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తోందని జవాబు**

**నేటి ప్రభాత సూర్య డెస్క్ :** ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీ– వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెబుతున్నాయి. తాజాగా ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలపై ఇవి నిర్మొహమాటంగా ట్రంప్ చెంప ఛెల్లుమనేలా సమాధానం ఇచ్చాయి.భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా.. అవి చెప్పిన సమాధానాలు ట్రంప్ మూర్ఖత్వాన్ని తెలియచేశాయి. భారత్‌ది డెడ్ ఎకానమియా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది' అని చాట్‌జీపీటీ పేర్కొంది. భారత్‌ది డెడ్ ఎకానమి కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని గ్రోక్ వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' –జెమిని తెలిపింది. ఇక, మెటా ఏఐ, కోపైలట్ లు కూడా ఇలాంటి సమాధానాలే ఇచ్చాయి. రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందనే కారణంతో భారత్‌పై 25శాతం సుంకం, పెనాల్టీలు విధిస్తున్నట్లు– ట్రంప్ ప్రకటించారు. దీన్ని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్.. వాటి డెడ్ ఎకానమిలను మరింత దిగజార్చుకునే అవకాశముందన్నారు. వారు ఎలాంటి వాణిజ్య సంబంధాలు కుదుర్చుకున్నా పట్టించుకోనన్నారు. ఈ వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మరోవైపు, ట్రంప్ మాటలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ఆ విషయాన్ని ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు సైతం తప్పుబట్టడం గమనార్హం.

# యువతను క్రీడల వైపు మళ్లిస్తున్నాం

**మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**




యువతను క్రీడల వైపు మళ్ళిస్తూ ,అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుటకు తెలంగాణ క్రీడల పాలసీని తీసుకురావడం జరిగిందని రాష్ట్ర క్రీడల యువజన సర్వీసుల పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కన్‌క్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసులు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే కొత్తగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తూ అన్ని క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన ఈ పాలసీ ద్వారా క్రీడలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని అన్నారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ వాటి ప్రాముఖ్యతను పెంచే విధంగా నూతన క్రీడా విధానం అమలు చేస్తూ అమలు చేయుటలో పని చేస్తామని మంత్రి తెలిపారు. ఈ పాలసీ అమలులో గతంలో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు, దీర్ఘకాలంగా క్రీడల్లో ఉన్న వారు, క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వారికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభిస్తున్న క్రీడల పాలసీ క్రీడల అభివృద్ధి కొరకు క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయుటకు దోహదపడుతుందని మంత్రి తన అభిప్రాయాన్ని తెలిపారు. ఈ పాలసీలో పొందుపరిచిన జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వాహకుల సహాయ సహకారాలు తీసుకొని ఆస్థాయిలో క్రీడల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. 2036లో జరిగే ఒలింపిక్స్‌ను లక్ష్యంగా చేసుకొని క్రీడాకారులకు ఆయా క్రీడలలో శిక్షణ ఇప్పించడం జరుగుతు ం దని, తమ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా క్రీడాకారులకు విధి విధానాలను కల్పిస్తూ ఈ పాల సీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారని మంత్రి తెలిపారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, అడ్వైజర్ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాల చారి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్, వైస్ ఛైర్మన్ మరియు ఎం.డి. సోనీ బాల, గోపిచంద్ అకాడమీ ఫౌండర్ పుల్లెల గోపీచంద్, ప్రముఖ క్రీడాకారులైన గగన్ నారంగ్, అంజు బాబి జార్జ్, సుమిత్ పాండే, అభినవ్ బింద్రా, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ సాక్షిగా యూరియాపై తప్పుడు లెక్కలు

- ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
- కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్- నేటి ప్రభాతసూర్య :**



పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుఅన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్‌లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్‌కి కేంద్ర రసాయనాలు, ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దాని కంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు కేటాయింపులప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేవలం తెలంగాణలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై ముఖ్యమంత్రి రేవంత రెడ్డి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకి లేఖలు కూడా రాయడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, జులై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24లక్షల మెట్రిక్ టన్నుల యూరియానుకలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లేఖలో కోరారు.






# కాళేశ్వరం కేసులో కెసిఆర్ పక్కా దోషి

మొదటిపేజీ తరువాయి..

మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ సొంత లాభం మాత్రమే చూసుకున్నారని తెలిపారు. కెసిఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని అన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నియోజక వర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయని, ప్రతిపక్షాల కుట్రల వల్ల వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని తెలియజేశారు. కాంగ్రెస్‌లో గ్రూపులు సహజం.. పార్టీలో గ్రూపులు ఉండాలని, ఎన్నికల సమయానికి అందరూ పార్టీ కోసం పోరాడాలని సూచించారు. గ్రూపుల వల్ల నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత తమది అని హామీ ఇచ్చారు. కెసిఆర్ కుటుంబం అబద్ధాల పుట్టని, బిఆర్ఎస్ చేతగానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్టుకు ఎపి ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. తమ ఫిర్యాదు వల్లే బనకచర్ల ప్రాజెక్టు పనులు ఆగాయని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

TGTEL/25/A0784 సూర్య తెలుగు దిన పత్రిక www.prabhatasurya.com


## శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆర్బీవీఆర్ఆర్ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



**మంచిర్యాల జిల్లా , నేటి ప్రభాతా సూర్య ఆగస్టు 2:** రామగుండం కమిషనరేట్ పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆర్బీవీఆర్ఆర్ డైరెక్టర్, అదనపు డీజీ అభిలాష్ బిస్త్ శనివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ వేణు చందర్, ఎస్సై సంతోష్ ఆమెకు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన అభిలాష్ బిస్త్ గారు స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రం, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మహిళా సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి వారి పని తీరు, సౌకర్యాలపై సమాచారం తీసుకున్నారు. స్టేషన్ పనితీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్శన సందర్భంగా పోలీస్ అధికారులకు ఆమె పలు సూచనలు చేయడం జరిగింది. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

## వారం రోజుల పాటు మంచినీటి సరఫరాకు అంతరాయం

**బెల్లంపల్లి, ఆగస్టు 2 (నేటి ప్రభాతా సూర్య):** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నివాసితులకు వారం రోజుల పాటు మంచినీటి సరఫరా నిలిచిపోనుంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మంచినీటి సరఫరా కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అడ ప్రాజెక్ట్ వద్ద ఉన్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నది ఇంటేక్ పాయింట్‌లో భారీగా చెత్త పేరుకుపోవడంతో సమస్య తలెత్తిందని కమిషనర్ పేర్కొన్నారు. చెత్తను పూర్తిగా తొలగించేవరకు నీటి శుద్ధి, పంపిణీ కార్యకలాపాలు సాధ్యపడవని, దాంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు సహకరించాలని, ముందస్తుగా అవసరమైన నీటిని నిల్వ చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అధికారులు తెలిపారు.




## భీమాతో నిశ్చింతగా ఉండవచ్చు: ఫీల్డ్ ఆఫీసర్ భాను



**మంచిర్యాల జిల్లా,నేటి ప్రభాతా సూర్య. ఆగస్టు 2:** నెన్నెల: ప్రతి ఒక్కరూ భీమాను తీసుకొని భవిష్యత్తు పట్ల నిశ్చింతగా ఉండవచ్చని నెన్నెల గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ భాను సూచించారు. శనివారం నెన్నెల మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన జన సురక్షణ క్యాంపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ, 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారందరూ "ప్రధాన్ మంత్రి జన సురక్షా యోజన"కు సంబంధించిన భీమాను రూ.20 ప్రీమియంతో తమ బ్యాంక్ ఖాతా ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం కింద అర్హులకు రూ.2 లక్షల ప్రమాద భీమా వర్తించనుందని వివరించారు. అలాగే, "ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన" కింద సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే మరణ భీమా రూపంలో రూ.2 లక్షల పరిహారం లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ భవిష్యత్తు భద్రతను దృష్టిలో పెట్టుకొని తప్పకుండా ఈ భీమా పథకాలలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బందితో పాటు గ్రామస్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మన్ వీరబాబుకి విద్యార్థుల సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయానికి నూతనంగా నియమితులైన గ్రంథాలయ చైర్మన్ వీరబాబుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిని విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ వీరబాబు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలు పొందాలని కష్టపడి చదివితే సాధించలేనిది అంటూ ఏమీ ఉండదని ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగులుగా ఇక్కడి నుంచి వెళ్లాలని వారికి ఎటువంటి అవసరాలు ఉన్న తక్షణమే చర్య తీసుకుని తగిన ఏర్పాట్లు చేసి తన వంతు బాధ్యతను నిర్వహించి అన్ని సదుపాయాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అందుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు జి.మణి మృదుల పాఠకులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మృతిచెందిన శ్రావణ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి వివేక్

### మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించిన మంత్రి





**మంచిర్యాల జిల్లా, ఆగస్టు 2 (నేటి ప్రభాత సూర్య):** మందమర్రి ఏరియాలోని కేకే%-%5 గనిలో శుక్రవారం జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన రాచపల్లి శ్రావణ్ కుటుంబాన్ని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం పరామర్శించారు. ఏరియా హాస్పిటల్‌కు చేరుకున్న మంత్రి, ముందుగా శ్రావణ్ మృతదేహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. తర్వాత బాధిత కుటుంబాన్ని కలిసి మౌనసానుభూతి తెలియజేశారు. వారి ఆవేదనను నేరుగా విని, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "ప్రతి కార్మికుడు మన కుటుంబ సభ్యుడే. వారి త్యాగం భూగర్భ గనుల్లోనే కాదు %-% రాష్ట్ర అభివృద్ధిలోనూ భాగస్వామిగా ఉంది" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. శ్రావణ్ కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు తాను కట్టుబడినట్టుగా తెలిపారు. తక్షణ పరిపూరణగా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఈ ప్రమాదంపై విచారణ జరిపి భద్రత ప్రమాణాలను మరింతగా పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు.

"సింగరేణి కార్మికుల భద్రత పట్ల రాష్ట్ర ప్రభుత్వం గట్టి సంకల్పంతో ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సాంకేతికపరంగా, భద్రతాపరంగా సంస్కరణలు తీసుకురావాలి" అని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టియుసి, సీఐటీయూ నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ రాగా ప్లే స్కూల్లో ఫ్రెండ్ షిప్ డే వేడుకలు







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని మెదరబస్తిలో ఉన్న శ్రీ రాగా ప్లే స్కూల్ లో శనివారం ఫ్రెండ్ షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లే స్కూల్ చిన్నారులతో ఫ్రెండ్షిప్ బ్యాండ్ లను క్లాస్ రూంలో ప్లే స్కూల్ స్టాఫ్ తయారు చేయించి వాటితోనే చిన్నారుల చేతులకు కట్టించారు.

హ్యాపీ ఫ్రెండ్షిప్ డే అంటూ కేరింతలతో ప్లే స్కూల్ ప్రాంగణం అంతా ఆనందంతో దద్దరిల్లింది. చిన్నారులు ప్రేమతో ఒకరికొకరు ఆప్యాయతతో విషెస్ చెప్పుకునే విధానం అందరినీ అబ్బుర పరచింది. ఆగస్టు 3న ఆదివారం సెలవు దినం కావడంతో శనివారమే ఈ వేడుకలు జరుపుకుంటున్నాం అని మేనేజ్మెంట్ మల్లారపు వరప్రసాద్ కవితలు అన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వర ప్రసాద్ ప్లే స్కూల్ చిన్నారులకు స్టాఫ్ కు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, సర్వేశ్వర రావు, సురేష్ కుమార్, రాజ్కుమార్, బాలు, రమేష్, భువన, అనుష, రోహిణి, ముస్కాన్, మహేశ్వరి, శోభా రాణి, కవిత, రేష్మా, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



**తుర్కయంజాల్ -నేటి ప్రభాత సూర్య:** గొర్రెలకు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని అబ్దుల్లా పూర్ పెట్ మండలం మండల పశువైద్యాధికారి డా. శిల్పారెడ్డి తెలిపారు. తుర్కయంజాల్ లో గొర్రెలకు, మేకలకు నీలి నాలుక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో జీవాలకు వచ్చే వ్యాధుల పట్ల పశుపెంపకం దారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీవాలకు నీలి నాలుక వ్యాధి సోకితే నోటి చుట్టూ పుండ్లు కావడం, నాలుక నీలం రంగులోకి మారడం, జలుబు, శ్వాసకోశ సమస్యలు వస్తాయన్నారు. వ్యాధి సోకితే జీవాలు తలకిందులుగా పడిపోవడం, లేకలేకపోవడం, గర్భస్రావం, మృత ప్రసవాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా టీకాలు వేస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ కురుమ సంఘం అధ్యక్షుడు వస్పరి బాబయ్య, ప్రధాన కార్యదర్శి గుండనర్సింహ ,కురుమ సంఘం డైరెక్టర్,మాజీ కౌన్సిలర్,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు,కొత్తకూర్మ.మంగమ్మ,మాజీ అధ్యక్షుడు గుండా లింగమయ్య,తుర్కయంజాల్ బీజేపీ పార్టీ ఉప అధ్యక్షుడు గుండా కృష్ణ,బండారి.మల్లయ్య,గుండా అనిల్, గుండా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి వివేక్ వెంకటస్వామి



**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాతా సూర్య. ఆగష్టు 2:** మందమర్రిమండలం రామకృష్ణాపూర్ కాకతీయ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం ను రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఒక్కొక్క నియోజక వర్గానికి రెండు వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం అన్నారు. పేద ప్రజలకు ఉచితంగా మంచి విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. మంత్రి వివేక్, కలెక్టర్ దీపక్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, మంచి ర్యాల డీసీపీభాస్కర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాక్ష్యాలు ప్రవేశపెట్టి అంతిమ తీర్పులకు సహకరించాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):** సాక్ష్యాలు ప్రవేశపెట్టి అంతిమ తీర్పులకు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ జైలులో ఉన్న ముద్దాయిల కేసులను దశలవారీగా రోజువారిగా సాక్ష్యాలు ప్రవేశపెట్టి అంతిమ తీర్పులకు సహకరించాలని వారెంట్లు ఉన్న పెండింగ్ కేసులు వెంట వెంటనే అమలు పరచాలని తెలిపారు. పాత పెండింగ్ కేసులలో సాక్ష్యాలను తీసుకొని రావాలని నూతనంగా నమోదైన కేసులలో వెంటనే ఛార్జ్ షీట్స్ దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి ఎస్. సరిత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కే.కిరణ్ కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఏం.రాజేందర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కర్నాటి కవిత, రెండవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.రవి కుమార్ సుపరీ%శీ%టెండెంట్ ఆఫ్ పోలీస్ బిరుదు రాజు రోహిత్ రాజు, ఏఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏపిపిలు, జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఫారెస్ట్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, కోర్టు నోడల్ ఆఫీసర్, కోర్టు లైజాన్ ఆఫీసర్లు పోలీస్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలపై దేశ ప్రజలకు మోడీ సమాధానం చెప్పాలి

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):** ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్ పాకిస్తాన్ యుద్ధ విరమణ విషయంలో పదేపదే యుద్ధం నేనే ఆపేనంటున్న ట్రంప్ వ్యాఖ్యలపై భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. శనివారం భద్రాద్రి జిల్లా కేంద్రంలో జరిగిన సిపిఎం జిల్లా వర్క్ షాప్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పాకిస్తాన్ యుద్ధం నేనే ఆపేనని పదేపదే చెబుతున్నప్పటికీ అది అబద్ధమని రెండు దేశాల మధ్య సమస్యను మేమే పరిష్కరించుకుంటామని అమెరికా జోక్యం తగదని చెప్పడానికి ప్రధాని మోడీకి నోరు రావట్లేదని ఆయన విమర్శించారు. పార్లమెంటులో ప్రతిపక్షాలు కూడా ట్రంప్ జోక్యం ఉందా లేదా అనే ప్రశ్నకు మోడీ సమాధానం చెప్పకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. ఇటీవల భారత్ పై సునా[illegible]లు విధిస్తామని చెప్పినప్పటికీ అమెరికా విషయంలో నోరు మెదపడం లేదని మరోవైపు బ్రిటన్ కూడా వాణిజ్య ఒప్పందం పేరుతో సుంకాలి విధిస్తుంటే మాట్లాడడం లేదని ఆరోపించారు. భారత వ్యవసాయ రంగాన్ని అమెరికాకు అప్పచెప్పే చీకటి ఒప్పందానికి మోడీ ట్రంప్ తో స్నేహబంధం కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు.

మైనార్టీల మీద కక్ష సాధింపుకే బీహార్‌లో ఓటర్ల రివిజన్ ప్రక్రియ ముందుకు తీసుకొచ్చారని కేవలం ఇది బీహార్ కు మాత్రమే పరిమితం కాదని అన్ని రాష్ట్రాల్లో జరిగే ప్రమాదం ఉందనీ అన్నారు. ఓటర్ల రివిజన్ ఉపయోగించి ముస్లింలను తగ్గించాలని చూసిందనీ విమర్శించారు. ఓటర్ల రివిజన్ పై సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనను పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. పహల్గాం దాడులను బిజెపి రాజకీయాల కోసం వాడుకుందనీ దేశంలో ప్రతి అంశాన్ని మతకోణంలో చూస్తున్నారని ప్రజల మధ్య మత వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. చరిత్రను వక్రీకరించి చరిత్రలో దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను హిందూ ముస్లిం పోరాటాలుగా చిత్రీకరించడం చరిత్రను కూడా ఉత్పత్తి సంబంధాలు ఆధారంగా కాకుండా మతాల పేరుతో విశ్లేషిస్తున్నారని ఆరోపించారు. జాతీయ మీడియా బిజెపి భజన చేస్తున్నదాని అసలు విషయాలను కప్పిపెడుతుందనీ మీడియా పూర్తిగా కార్పొరేట్ల కబంధ హస్తాల్లో ఉందని ఆరోపించారు. ఆపరేషన్ సింధూర్ పై గురించి మోడీ దగ్గర సమాధానం లేదనీ పార్లమెంట్లో చర్చ జరగాలని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయి లబ్ధిదారులకు చేరట్లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు అందడం లేదనీ రాజకీయ పార్టీ నాయకులు చెప్పినవారికే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం సరైనది కాదనీ అన్నారు.

బిజెపికి చిత్తశుద్ధి ఉంటే ఐదు పంచాయతీలు కలపాలి. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ నుండి ఆంధ్రకు వెళ్లిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపే విధంగా చూడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. అయోధ్యలో రాముడే కాదు భద్రాచలం రామాలయం అభివృద్ధి కూడా చూడాలనీ ఎద్దేవా చేశారు. భద్రాద్రి రాముడిపై వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్మిస్తే భద్రాచలం మునగాక తప్పదనీ దీని రక్షించాల్సిన బాధ్యత ఉందనీ అన్నారు. పోలవరం ఇపుడున్న డిజైన్ ప్రకారం పూర్తి చేస్తే భద్రాది రాముని గుడి కూడా మునుగుతుందని దీనిపై బీజేపీ నాయకులు స్పందించాలని హితవు పలికారు. పై విషయాలపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు తమ ప్రభుత్వంతో మాట్లాడాలని రామచంద్రరావుకు సూచించారు. ఇవి వదిలేసి పిచ్చి ప్రేలాపనలు చేయడం వలన ఉపయోగం లేదని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు శంకుస్థాపనలు నాలుగు ప్రాజెక్టుల పేరుతో చేసినప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చుక్క నీరు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనులకు అరవై కోట్ల నిధులు కేటాయించి కేనాల్ నిర్మించినప్పటికీ నీరు పారడం లేదనీ పదమూడు వేల కోట్ల బడ్జెట్ను పందొమ్మిది వేల కోట్లకు పెంచి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందనీ బడ్జెట్ పెరుగుతుంది తప్ప పనుల్లో ఎలాంటి అభివృద్ధి లేదని ఆరోపించారు. పూర్తి స్థాయిలో ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేసి భద్రాద్రి జిల్లాకు నీళ్లు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. లేకుంటే ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లా ప్రజలను చైతన్యం చేసి ఆందోళన నిర్వహిస్తామన్నారు.

అనంతరం స్థానిక సమస్యలపై వారం రోజులపాటు జిల్లాలో సిపిఎం నిర్వహించిన సమస్యల అధ్యయన యాత్రల వివరాలను సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు వివరించారు. తమ అధ్యయనంలో భాగంగా వచ్చిన స్థానిక సమస్యలపై దశలవారి పోరాటాలు చేస్తామని ముందుగా జిల్లాలో ఉన్న సమస్యలను కలెక్టర్కు వివరిస్తామని తెలియజేశారు. అధికారులు ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామని తెలియజేశారు.

ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ఏజే రమేష్ సీనియర్ నాయకులు ఎలమంచిలి రవికుమార్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి ఎం.జ్యోతి అన్నవరపు సత్యనారాయణ కారం పుల్లయ్య బ్రహ్మాచారి లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే ముద్దు.. డబ్బా పాలు వద్దు: ఐసిడిఎస్ వినీత దేవి

### రెండవ రోజు కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

### గర్భిణీలకు, బాలింతలకు అవగాహన సదస్సు





**యాచారం నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 02):**
ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు రెండవ రోజు కొనసాగుతున్నాయి. శనివారం ఐసిడిఎస్ ఇబ్రహీంపట్నం ప్రాజెక్టు పరిధిలో యాచారం మండల పరిధిలోని నానక్ నగర్‌లో వినీతా దేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టగానే తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. సుమారు రెండు సంవత్సరాల వరకు పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలే ఆరోగ్యానికి చాలా మంచిదని చెప్పారు. తల్లిపాలతోని బిడ్డలకు మేధస్సు పెరుగుతుందన్నారు. శిశువు ఆరోగ్యం జీవనరక్షకు తోడ్పడుతుందని తెలియజేశారు. గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు తులసి, అరుణ, ఏఎన్ఎం జయ, పద్మ, వివో సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి డా. వివేక్ వెంకటస్వామి






**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాతా సూర్య ఆగష్టు. 2:**
చెన్నూరు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి శనివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు, విద్యాబోధనకు అనుకూల వాతావరణం కల్పించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ గ్రంథాలయం విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే కేంద్రంగా, పఠనాభిరుచిని కలిగించే వేదికగా నిలవనుంది" అని పేర్కొన్నారు.
విద్యను ప్రోత్సహించడంలో పాఠశాలల పాత్ర ఎంతో ముఖ్యమైందని, విద్యా రంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల ఆందోళన.. గన్నేరువరం ఏవోతో వాగ్వాదం



**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**



మండల కేంద్రంలోని గ్రోమోర్ షాప్ వద్ద శనివారం రైతులు యూరియా పంపిణీ చేయాలని ఏవో కిరణ్మయితో వాగ్వాదానికి దిగారు. యూరియా కోసమని గ్రోమోర్ షాప్ కు వెళ్తే లిక్విడ్ పదార్థాలు కొంటేనే యూరియ ఇస్తామని నిర్వాహకులు కోర్రిలు పెడుతున్నారని, స్టాక్ వున్నా లేదని చెప్పుతున్నారన్నారు. బ్లాక్ లో అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్నారని, మూడు రోజులుగా తిరుగుతున్న ఒక్క యూరియా బస్తా ఇవ్వడం లేదని, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్‌లో అమ్మడం వలన రైతులపై అదనపు భారం పడుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కోసం రైతులను ఇబ్బంది పెడుతున్న గ్రోమోర్ షాపును వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ఏవో కిరణ్మయి రైతులతో మాట్లాడారు. రైతులకు మరలా ఈ సమస్య రానివ్వకుండా చర్యలు తిసుకుట్టమని, రైతులు ఆందోళన చెందవద్దని సముదాయించారు.

# విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

### భవిష్యత్తులో సమాజానికి విద్యార్థులు ఉపయోగపడాలి

### క్రీడల్లో, క్రమశిక్షణలో నైపుణ్యం పెంచుకోవాలి

### స్టీఫెన్ స్కూల్ చైర్మన్ జక్కుల ఆనంద్ రెడ్డి



**యాచారం నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 02):**
విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలో తమ్మలోను గూడ సమీపంలో స్టీఫెన్ హై స్కూల్ ప్రిన్సిపల్ జక్కుల సిల్వియా రెడ్డి ఆధ్వర్యంలో 9, 10 తరగతి విద్యార్థులతో నాయకత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో విద్యార్థులను నాయకత్వం లక్షణాలను పెంపొందించడం చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు తమ జీవితంలో మరింత సమర్థవంతంగా, బాధ్యతా యుతంగా ఎదగాలని ఆయన కోరారు. విద్యార్థుల అభివృద్ధి, విద్యార్థుల వ్యక్తిగత సామాజిక అభివృద్ధి దోహాదపడేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్తులో విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని కోరారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు, అంతేకాకుండా క్రమశిక్షణ, సాంస్కృత రంగాల్లో కొనసాగించాలని కోరారు. విద్యార్థి నాయకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. వారికి బ్యాడ్జీలు కూడా ఎమ్మెల్యే రంగారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి అలంకరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జక్కుల ఆనంద్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె అమర్నాథ్ రెడ్డి, నాయకులు మాజీ ఎంపీపీ రాచర్ల, వైస్ ఎంపీపీ దిండి రామ్ రెడ్డి, బిల కంటి శేఖర్ రెడ్డి, వరికుప్పల సుధాకర్, పడకంటి శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లాకు రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ అవార్డు



### గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కలెక్టర్ జితేష్ వి పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం(నేటి ప్రభాత సూర్య):**
వెనుకబడిన జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో అభివృద్ధి సూచికలన్నింటినీ సమర్థంగా సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రాజ్ భవన్‌లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలోరాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు అవార్డు ప్రధానం చేశారు. నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లాల అభీవృద్ధిలో భాగంగా విద్య ఆరోగ్యం వైద్యం వ్యవసాయం మౌలిక వసతులు సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టబడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ ఆరు సూచికలలో మూడు సూచికలపై శాతం సంపూర్ణత సాధించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందింది. అంతేకాక గుండాల మండలం బ్లాక్ స్థాయిలో ఐదు సూచికలను విజయవంతంగా పూర్తి చేసి ఆకాంక్షిత బ్లాక్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ అధికారి బృందాలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెంను అవార్డు కోసం ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం జిల్లాలోని అధికార యంత్రాంగం మండల అధికారులు గ్రామస్థాయి సిబ్బంది ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచిందన్నారు. ప్రతి గ్రామానికీ అభివృద్ధి కల్పించాలన్న సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయి అని ప్రతి సూచికపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ అవార్డు మాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అన్నారు. ముందుగానే ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చు అన్నారు. భవిష్యత్తులో జిల్లా మరిన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడేలా చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు.

# సింగరేణిలో మహిళల ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకోవాలి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా(నేటి ప్రభాత సూర్య):**
సింగరేణిలో మహిళా సాధికారతకు గౌరవప్రదమైన ప్రాధాన్యం ఇవ్వాలని మహిళా ఉద్యోగుల భద్రతకు తగిన చర్యలు తక్షణమే తీసుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ డిమాండ్ చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. కార్పొరేట్ ఏరియా పరిధిలో
వర్క్‌షాప్ ఆవరణలో శనివారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఫిట్ సెక్రటరీ రాజేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏబీకేఎంఎస్ కార్యదర్శి మాధవ నాయక్, వేజ్ బోర్డు సభ్యులు టీఎస్.పవన్ కుమార్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ స్టాండడైజేషన్ కమిటీ సభ్యులు బి.రామ్ సింగ్, యూనియన్ ఉపాధ్యక్షులు జీవి.కృష్ణారెడ్డి పాల్గొన్ని ప్రసంగించారు. సింగరేణిలో మహిళా సాధికారతను వాస్తవికంగా ప్రోత్సహించాలంటే మహిళా ఉద్యోగుల భద్రత సౌకర్యాలు గౌరవంతో కూడిన పని వాతావరణం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనులలో ఇతర శాఖలలో పని చేస్తున్న మహిళల కోసం ప్రత్యేకంగా బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరిశుభ్రమైన సురక్షితమైన మహిళా వాష్ రూములు అన్ని బొగ్గు గనుల్లో డిపార్ట్మెంట్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సదుపాయం మహిళలు పనిచేసే ప్రతి విభాగంలో సులభంగా పొందగలిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ



కోసం పని ప్రదేశాల దగ్గర లేదా దగ్గరలో డే కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా భద్రత కోసం ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి లైంగిక వేధింపుల నివారణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సంస్కరణాత్మక అవగాహన కార్యక్రమాలు మహిళా హక్కులు లైంగిక వేధింపుల నిరోధంపై ఉద్యోగులందరికీ అవగాహన కల్పించే శిక్షణలు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు గౌరవంగా సమాన హక్కులతో పని చేసే వాతావరణాన్ని కల్పించాల్సిన పూర్తి బాధ్యత యాజమాన్యం మీద ఉందని స్పష్టం చేశారు.
సమాన అవకాశాలు సమాన గౌరవం అనే నినాదంతో సంస్థ ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.మాధవ నాయక్, టిఎస్ పవన్ కుమార్, బి. రామ్ సింగ్, జీవీ కృష్ణారెడ్డి, మొగిలి పాక రవి, సంగం చందర్, రాజమౌళి, ఇసాక్, శ్యాంలాల్, ఇనుపనూరి నాగేశ్వరరావు, రాకేశ్, భీమా తదితరులు పాల్గొన్నారు.

# మల్కీజ్‌గూడలో భూ సమస్యలను పరిష్కరించండి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతి పత్రం అందజేత

### యాచారం తాసిల్దార్ అయ్యప్పకు ఆదేశాలు జారీ



**యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 02):**
మండల పరిధిలో మల్కీజ్ గూడలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ఓ బి సి అధ్యక్షుడు పల్లపు నరేష్ ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగపురం కిషన్ రెడ్డి ని యాచారం మండల కేంద్రం రైతు వేదికలో మర్యాదపూర్వకంగా రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం అనంతరం.. మా భూములను ఆన్లైన్లో ఎక్కించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నీ రైతులు కోరారు. వెంటనే ఆర్డిఓ అనంతరెడ్డి, యాచారం తహసిల్దార్ అయ్యప్ప కు రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు జరుపల విజయ్ కుమార్, తాండ్ర రవీందర్, గోగి కార్ రమేష్, నడికుడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# తాగిన మైకంలో లారీని ఢీ కొట్టిన కారు- కారు డ్రైవర్‌కు గాయాలు




**షాబాద్: ఆగస్టు 2(చేర్ల గూడెం సురేందర్) షాబాద్ మండల రిపోర్టర్.**
రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం రేగడి చిల్క మర్రి గ్రామానికి చెందిన కావలి రాములు అనే వ్యక్తి తాగిన మైకంలో కారు నడిపి రోడ్డుపై వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన ఘటన శనివారం సాయంత్రం 7:30 ప్రాంతంలో సర్దార్ నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. చేవెళ్ల నుండి షాద్ నగర్ వైపు వెళ్తున్న లారీని వెనకనుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ కు గాయాలయ్యాయి. అతడు నడిపిన వాహనం %ూ 07 స్గ% 9167 గా గుర్తించారు. ప్రత్యక్ష సాక్షులు: సర్దార్ నగర్ ప్రాంతంలో వేగంగా వచ్చిన కారు ముందుగా వెళుతున్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీ కొట్టింది ఢీ కొట్టిన కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసం అయింది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం ప్రస్తుతం డ్రైవర్ కు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తుంది.

# దరఖాస్తుల కోసం ఆహ్వానం


**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాతా సూర్య, ఆగస్టు 2:**
హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశాల కోసం బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ అధికారి కే. దయానంద రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులు సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయం మొదటి అంతస్తులోని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం (రూమ్ నంబర్: %ఖీ%3) లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఆగస్టు 8 అని పేర్కొన్నారు.
01.06.2018 నుంచి 31.05.2019 మధ్య జన్మించిన విద్యార్థులే అర్హులు అని ఆమె వివరించారు. దరఖాస్తు ఫారంతో పాటు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు మరియు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు జత చేయాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను ఆగస్టు 11న లాటరీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇతర వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 63097 65141.



# బాల్య వివాహాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

## ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ఆన్ లైన్ అప్లికేషన్ల గడువు పొడిగింపు





**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**
తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్)లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన అభ్యర్థుల నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తుల గడువు ముగియగా.. అధికారులు మరోసారి పొడిగించారు. ఆగస్టు 18 వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్లైన్ లో (మీసేవ) కేంద్రాలలో అడ్మిషన్లు చేసుకోవచ్చని గన్నేరువరం మండల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ఎంఈఓ కే. రామయ్య తెలిపారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం



**నేటి ప్రభాత సూర్య:**
తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్వాడి సూపర్వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గుండ్లపల్లి అం గన్వాడి సెంటర్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సంద ర్భంగా బాలింతలకు గర్భవతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపించాలని సూచించారు. గర్భవతులు బాలింతలు పౌష్టిక ఆహారం, ఆకుకూరలు, పాలు, గుడ్లు, తీసుకోవాలని తెలియజేశారు. గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రి లో ఇచ్చే మందుల తోపాటు డాక్టర్ దగ్గర పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సుజాత గర్భవతులు బాలింతలు, పాల్గొన్నారు.


## చిన్నారులకు తల్లిపాలే రక్షణ

### తల్లిపాల వారోత్సవాలు



**నేటి ప్రభాత సూర్య:**
మండల కేంద్రమైన కొండాపురం లోని కొండాపురం-3, ఓబన్నపేట, గండ్లూరు, అంగన్వాడి సెంటర్లలో శనివారం తల్లిపాలు చిన్నారులకు రక్షణ గురించి గర్భవతులకు, బాలిం తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూ పర్వైజర్ బి.భారతి మాట్లాడుతూ తల్లిపాలే ఆరోగ్యం ఎదు గుదల్లో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో హెల్త్ డిపార్ట్మెంట్ రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు అం గన్వాడీ కార్యకర్తలు,పి.రాణి, రామ తులసి, వసంతలక్ష్మి, సులోచన, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెండవ శనివారం శ్రావణమాసం ఉత్సవాలు



**నేటి ప్రభాత సూర్య:**
శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా గండి క్షేత్రం లోని వీరాంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గండి వీరాంజనేయ స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం ఆలయ పూజారులు కేసరి, రాజా స్వాములు కల్పించారు. స్వామివారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య, పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణ తేజ వెల్లడించారు.

- సదస్సుకు ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి
- న్యాయ విజ్ఞాన సదస్సులో బాల్యవివాహాలపై, ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం
- సదస్సులో పాల్గొన్న న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్ రావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి
- సదస్సులో పాల్గొన్న నందిగామ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్





**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 2):**
బాల్యవివాహాలు సమాజంలో మాయని మచ్చగా తయారయ్యాయని, వీటిని న్యాయపరంగా కచ్చితంగా రూపుమాపాల్సిందేనని న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు చీపిరి చంద్రశేఖర్ యాదవ్ లతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ పి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన స్వాతి రెడ్డి మరియు కొత్త రవిలు మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించాల్సిన అవసరం మన అందరి పైన ఉందంటూ, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ, చట్ట ప్రకారం నిర్దేశించిన మగవారికి 21, ఆడవారికి 18, సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలని, వయస్సు నిండిన వారైతే మానసిక పరిపక్వత ఉంటుందని, లేదంటే చిన్నతనంలో వివాహాలు చేయడం వలన వారి కాపురాల్లో మనస్పర్థలు వచ్చే అవకాశాలు చాలా ఉంటాయని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చట్టం ప్రతిపాదించిన వయస్సు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలని తెలిపారు. బాల్యవివాహాలు సమాజంలో ఒక మాయని మచ్చగా తయారయ్యాయని, బాల్య వివాహాలు కొన్ని కొన్ని సందర్భాలలో కేసులుగా మారతాయని, అభివృద్ధి దిశగా పయనిస్తున్న మన దేశంలో అందరూ చట్టాలను గౌరవించాలని, ఒకవేళ బాల్యవివాహాలు చేపడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామాలలో బాల్యవివాహాలపై ఇంకా అవగాహన కార్యక్రమాలు పెంచే విధంగా అందరూ సహకారం మరియు ప్రోత్సాహం అందించాలని, బాల్య వివాహాల వలన జరిగే నష్టాలను అందరికీ వివరించాలని, బాల్య వివాహాలు చట్టవిరుద్ధం అని అందరికీ తెలియజేశారు. చట్ట విరుద్ధమైన పనులు చేయడం ద్వారా లేనిపోని కేసులలో ఇరుక్కొని ఇబ్బంది పడతారని, అందుకే చట్టవిరుద్ధమైన పనులు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ పి ప్రసాద్ మాట్లాడుతూ.. నందిగామ మండల కేంద్రంలో ఈ మధ్యనే 45 ఏండ్ల ఒక వ్యక్తితో, 13 సంవత్సరాల అమ్మాయికి బాల్య వివాహం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకున్నామని ఎవరు బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, ఎవరు చట్టాలకు అతీతం కాదని, బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే తల్లిదండ్రులతోపాటు ప్రోత్సహించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, బాల్య వివాహాలను రూపుమాపాల్సిన బాధ్యత సమాజంతో పాటు తల్లిదండ్రులకు కూడా ఉంటుందని, ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే తక్షణమే పోలీసు వారికి సమాచారం అందించాలని, సమ సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని అందరినీ కోరారు. న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరైన న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షులు నర్వ వేణుగోపాల్ రావు ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చీపిరి చంద్రశేఖర్ యాదవ్, మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డిలు ప్రసంగిస్తూ బాల్య వివాహాలను రూపుమాపి, విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సహించాలని, బాల్య వివాహాల వలన ఎన్నో కుటుంబాలు నష్టాల పాలవుతున్నాయని, పూర్తి మానసిక పరిపక్వత సాధించిన తర్వాత వివాహాలు చేస్తే, ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు ఆ సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక పరిపక్వత ఉంటుందని, చిన్నతనంలో వివాహాలు చేస్తే మానసిక పరిపక్వత లేని కారణంగా కుటుంబాల్లో తరచు గొడవలు జరిగే ప్రమాదం ఉంటుందని, శారీరక ఎదుగుదల కూడా లేక శారీరకంగా కూడా చాలా నష్టపోతారని, చిన్నతనంలోనే పిల్లలు పుట్టడం వలన ఎన్నో సమస్యలని ఎదుర్కోవాల్సి వస్తుందని, అందుకే చట్టం నిర్దేశించిన వయస్సు ఆధారంగానే పెళ్లిళ్లు చేసుకుని అందరూ సంతోషంగా ఉండాలని కోరారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్యవివాహల న్యాయవిజ్ఞాన సదస్సుకు న్యాయవాదులు పి. కృష్ణా రెడ్డి, కే. మనోహర్ రెడ్డి,ఇ. నర్సిములు, ఎండీ. రహీముద్దీన్, బి.రమేష్, మణికంఠ, శ్రీనివాస్ మూర్తి, కే.శ్రీకాంత్ తదితరులతో పాటు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డుల పంపిణీ




ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి





**తుర్కయంజాల్-నేటి ప్రభాత సూర్య:**
అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనిఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి మన్నెగూడ లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన నూతన రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అబ్దుల్లాపూర్ మెట్ తహసిల్దార్ సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే అమరేందర్ రెడ్డి లతో కలిసి రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి రేషన్ దుకాణాల ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు.దేశంలో సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన పేదవారికి ఆహార భద్రత కల్పించి, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను అందజేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్ ,మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్ల పల్లి హరిత ధన్ రాజ్ గౌడ్, టి పి సి సి సభ్యులు కాకుమాను సునీల్, మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, మాజీ కౌన్సిలర్లు మర్రి మాధవి మహేందర్ రెడ్డి, రేవల్ల హరిత యాదగిరి, మేతరి అనురాధ దర్శన్, కంబాలపల్లి ధనరాజ్, నక్క శివలింగం గౌడ్, బండారి బాలరాజ్, కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, నాయకులు సామ భీం రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి (జానీ ), ఓర్సు శ్రీనివాస్, బొక్క వంశిధర్ రెడ్డి, డాక్టర్ రాగ్యా నాయక్, మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ ఓ శ్రీనివాస్, ఆర్ ఐ వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



- డి.ఎస్.పి మురళి నాయక్

**నేటి ప్రభాత సూర్య:**
పులివెందుల జెడ్పిటిసి స్థానానికి ఈనెల 12వ తేదీ ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శనివారం పులి వెందుల డిఎస్పి మురళి నాయక్ మండలంలోని పోలిం గ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ముందుగా తుమ్మలపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన తుమ్మలపల్లె గ్రామ ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని, ఎవరు కూడా ఘర్షణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే చేయలేదని డి.ఎస్.పి తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం ఆయన పులి వెందుల రూరల్ మండల పరి ధిలోని పోలింగ్ బూతుల ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ చాంద్ బాషా, రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్సైలు నారా యణ, విష్ణు నారాయణ, పోలీసులు పాల్గొన్నారు.ప్రజలతో సమావేశాన్ని ఏ ర్పాటు చేశారు. అనంతరం ఆయన పులి వెందుల రూరల్ మండల పరిధిలోని పోలింగ్ బూతుల ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ చాంద్ బాషా, రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్సైలు నారాయణ, విష్ణు నారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

## అంగన్వాడిల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

### ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి



**చింతపల్లి- నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 2)**
చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం ఐ సి డి ఎస్ సూపర్వైజర్ పార్వతి ఆ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ పుట్టిన ప్రతి ఒక్క బిడ్డకు వెంటనే తల్లిపాలను అందించాలని ఆమె గర్భిణీలకు సూచించారు. తల్లిపాలు ఇవ్వటం వల్ల పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. తల్లి బిడ్డకు పట్టిన పాలు మొదటి టీ కాగా పనిచేస్తుందని ఆమె వివరించారు. ఆరు నెలల వరకు మాత్రమే తల్లిపాలు అందిం చాలని, ఏ ఇతర ఆహారం చిన్నారులకు ఇవ్వకూడదని సూచిం చారు. ఏడు నెలల నుండి 24 నెలల వరకు తల్లిపాలతో పాటు ప్రభుత్వం అందజేసే బలమృతాన్ని చిన్నాన్నకు అంది ఇవ్వాలని సూచించారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు పట్టడం ద్వారా తల్లికి బెస్ట్ క్యాన్సర్ రాదని పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారు అన్నారు. పుట్టిన బిడ్డకు, బిడ్డకు ఏడబాటు పాటించాలని ఆమె గర్భిణీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ ఐసిడిఎస్ అంగన్వాడి జల్దా పద్మ, అంగన్వాడి ఆయా, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చేపల వేట కోసం చెరువులోకి వెళ్లిన వ్యక్తి మృతిచెందిన సంఘటన



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 2):**
కేశంపేట్ మండలంలోని సంతా పూర్ గ్రామంలో శనివారం సాయంత్రం విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యాలాల రాకేష్ (38), వృత్తిరీత్యా మేస్త్రి, స్నేహితులతో కలిసి సాయం త్రం 5 గంటల సమయంలో గ్రామ శివారులోని నాగుల చెరు వులో చేపల వేట కోసం వెళ్లారు. ఈ సందర్భంగా మద్యం సేవించిన కారణంగా చెరువులో మునిగి మృతి చెందినట్లు అనుమాని స్తున్నారు. రాకేష్ గల్లంతయ్యాక స్నేహితులు చెరువులో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి యాలాల రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని కేశంపేట్ పోలీసులు తెలిపారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

# క్రీడారంగం



# సత్తాచాటిన భారత బౌలర్లు

## ఇంగ్లాండ్ 247 ఆలౌట్

ఇంగ్లాండ్, ఇండియా జట్ల మధ్య జరుగుతున్న ఐదో టెస్టు రసవత్తరంగా జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ ను నిలువరించిన భారత్.. తమ రెండో ఇన్నింగ్స్ ను మెరుగ్గా ప్రారంభించింది. శుక్రవారం రెండోరోజు ఆటముగిసేసరికి రెండో ఇన్నింగ్స్ లో భారత్ 18 ఓవర్లలో రెండు వికెట్లకు 75 పరుగులు చేసింది. విధ్వంసక ఓపెనర్ యశస్వి జైస్వాల్ సూపర్ ఫిఫ్టీ (49 బంతుల్లో 51 బ్యాటింగ్, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) సూపర్ టచ్ లో కనిపించాడు. క్రీజులో అతనితోపాటు నైట్ వాచ్ మన్ ఆకాశ్ దీప్ (4 బ్యాటింగ్) ఉన్నాడు. ఓవరాల్ గా ఇండియా ఆధిక్యం 52 పరుగులకు చేరుకుంది. ఓపెనర్ కేటఎల్ రాహుల్ (7), సాయి సుదర్శన్ (11) విఫలమయ్యారు. జోష్ టంగ్, గస్ అట్కిన్సన్ చెరో వికెట్ తీశారు. శనివారం మొత్తం బ్యాటింగ్ చేసి, వీలైనంత ఎక్కువగా టార్గెట్ ను ఇంగ్లాండ్ కు విధించాలని టీమిండియా భావిస్తోంది. అంతకుముందు ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 247 పరుగులకు ఆలౌట్ కాగా, ఇండియా 224 పరుగులు చేసింది. ఐదు టెస్టుల అండర్సన్- టెండూల్కర్ ట్రోఫీలో 2-1తో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉంది. పేసర్లకు స్వర్గధామమైన ఈ వికెట్ పై బౌలర్లు శుక్రవారం పండుగ చేసుకున్నారు. రెండో రోజు ఏకంగా 16 వికెట్లు నేలకూలడం విశేషం. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 204/6 తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా.. మరో 20 జోడించి మిగతా నాలుగు వికెట్లు కోల్పోయింది. కరుణ్ నాయర్ తన అర్ధ సెంచరీకి మరో ఐదు పరుగులు జోడించి ఔటవగా, గస్ అట్కిన్సన్ భారత లోయర్ ఆర్డర్ ను కకావికలం చేశాడు. వాషింగ్టన్ సుందర్ (26)లతోపాటు మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణను ఔట్ చేసి, ఫైఫర్ పూర్తి చేసుకున్నాడు. దీంతో భారత ఇన్నింగ్స్ 224 పరుగుల వద్ద ముగిసింది. మిగతా బౌలర్లలో జోష్ టంగ్ కు ఒక వికెట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ అదిరే ఆరంభం దక్కింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (64), బెన్ డకెట్ (43) జట్టుకు శుభారంభాన్నిచ్చారు. తొలి వికెట్ కు వేగవంతంగా ఆడి 77 బంతుల్లోనే 92 పరుగులు జోడించారు. అయితే డకెట్ వికెట్ తీసిన ఆకాశ్ దీప్ బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత ప్రసిధ్ నాలుగు, సిరాజ్ మూడు వికెట్లతో చెలరేగి ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ ను దెబ్బ తీశారు.


# మా మధ్య ఎమోషన్స్ తెగిపోయాయి

## విడాలకుపై తొలిసారి స్పందించిన చాహల్




టీమ్ఇండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ ఎట్టకేలకు ధన శ్రీ వర్మతో విడాకుల విషయంపై మాట్లాడాడు. రీసెంట్‌గా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న చాహల్ తన విడాకులకు గల కారణాలు వెల్లడించాడు. ఈ నిర్ణయం ఒక్కరోజులో తీసుకుంది కాదని, చాలా ఆలోచించిన తర్వాతే తాను ధన శ్రీతో విడిపోయినట్లు చెప్పుకొచ్చాడు. “వివాహ బంధానికి స్వస్తిచెప్పి, విడాకులు తీసుకోవాలన్న ఆలోచన మా ఇద్దరికీ ఉండేది. అయితే ఈ విషయం ఆఖరి వరకూ గోప్యంగానే ఉంచాలని నిర్ణయించుకున్నాం. మా పర్సనల్ లైఫ్ గురించి బయట పెట్టకూడదనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం. అంతేకాదు మా ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నప్పటికీ చాలా కాలం బయటి ప్రపంచానికి భార్యాభర్తలుగానే కనిపించాం” “మేమిద్దరం మా పర్సనల్ కెరీర్‌లో సక్సెస్ కావాలని అనుకున్నాం. అందుకే రిలేషన్‌షిప్‌కు ప్రాధాన్యం ఇవ్వలేకపోయాం. మా మధ్య ఎమోషన్స్ తెగిపోయాయి. ఇద్దరి ఆశయాలు, ఆలోచనలు, వ్యక్తిత్వాలు ఒకే మార్గంలో లేనప్పుడు రిలేషన్‌షిప్‌పై ఎఫెక్ట్ పడుతుంది. రిలేషన్‌షిప్‌లో కాంప్రమైజ్ అవ్వడం చాలా ముఖ్యం. ఒకరు కోపంగా ఉన్నప్పుడు, ఇంకొకరు సైలెంట్‌గా వాళ్లు చెప్పింది వినాలి.ఒక్కోసారి ఇద్దరి వ్యక్తుల వ్యక్తిత్వాలు మ్యాచ్ అవ్వవు” ‘కెరీర్‌లోపై సీరియస్‌గా ఉన్నప్పుడు భాగస్వామికి సమయం ఇవ్వడం కష్టం అవుతుంది.ఆ పరిస్థితులను మరొకరు అర్థం చేసుకోవాలి. నేను టీమ్ ఇండియాకు ఆడుతున్నా, ఆమె తన ప్రొఫెషన్‌లో ఉంది. ఇలా 1-2 సంవత్సరాలు కొనసాగింది. ప్రతీ ఒక్కరికీ తమ కెరీర్‌లో పర్సనల్ గోల్స్ ఉంటాయి. ఓ భాగస్వామిగా ఇద్దరూ పరస్పరం మద్దతు ఇచ్చుకోవాలి. నువ్వు ఏదో సాధించాలని 18-20 ఏళ్లుగా కష్టపడుతుంటే, ఆ కలను రిలేషన్‌షిప్ కోసం వదులుకోకూడదు” అని చాహల్ పేర్కొన్నాడు.

# కోహ్లీ రికార్డును బద్దలు కొట్టిన శుభ్‌మన్ గిల్



ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ నుంచి టీమ్‌ఇండియా కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్.. ఆటగాడిగానూ తన ఆటతో రికార్డులు బద్దలు కొడుతున్నాడు. ఓవల్ వేదికగా జరు గుతున్న ఐదో టెస్టులో పరుగుల జాబితాలో భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీని అధిగమించాడు. ప్రస్తుతం జరుగుతున్న అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ప్రదర్శన అసాధారణమైనది. ఈ సిరీస్‌లో గిల్ ఇప్పటివరకు 722 పరుగులు చేయగా.. యావరేజ్ 90గా ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన ఒకే మ్యాచ్‌లో అతని రికార్డు బద్దలు కొట్టిన 430 పరుగులు చేసి.. అలన్ బోర్డర్‌తో పాటు రెండు ఇన్నింగ్స్‌లలో 150 కంటే ఎక్కువ పరుగులు చేసిన రెండవ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారతదేశం తరపున కెప్టెన్‌గా అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ 2016 రికార్డును కూడా గిల్ బద్దలు కొట్టాడు. ఒకే సిరీస్‌లో అతను నాలుగు సెంచరీలు సాధించి, సునీల్ గవాస్కర్, డాన్ బ్రాడ్‌మాన్ వంటి దిగ్గజాల రికార్డులను సమం చేశాడు.ఈ సిరీస్‌లో గిల్ ఫామ్ భారతదేశానికి చాలా కీలకంగా ఉంది. స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌తో కలిసి, విదేశాల్లో టెస్ట్ సిరీస్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన తొలి భారతీయ పార్ట్‌నర్స్‌గా నిలిచారు. గత 50 ఏళ్లలో ఏ టీమ్ ఇండియా బ్యాటింగ్ పార్ట్‌నర్స్ కూడా ఈ ఘనత సాధించలేదు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో బౌలర్లు ఇబ్బంది పడుతున్నప్పటికీ గిల్ నిలకడ భారతదేశాన్ని ఆటలో నిలిపాడు.



# ఓజీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ విడుదల

టాలీవుడ్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ అభిమానులను అలరించాయి ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ ఓజీ ఫైర్ స్ట్రోమ్‌ని విడుదల చేశారు మేకర్స్. థమన్ సంగీతం అందించిన ఈ పాటకు థమన్ ఎస్, నజీరుద్దీన్ భరతరాజ్, సిలంబరసన్ టిఆర్ (శింబు), దీపక్ బ్లూ, రాజాకుమారి కలిసి పాడారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

# సినిమా



# దూసుకుపోతున్న సైయారా మూవీ

## సైలెంట్‌గా కలెక్షన్లు రాబడుతున్నట్లు వెల్లడి

అహన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్-టైనర్ 'సైయారా' మూవీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ప్రేమకథా చిత్రం ప్రస్తుతం మూడో వారంలోకి అడుగు పెట్టింది. శుక్రవారం 'సన్ ఆఫ్ సర్దార్ 2' , 'ధడక్ 2' విడుదలైనప్పటికీ 'సైయారా'కు ప్రేక్షకుల్లో ఆదరణ తగ్గలేదు. ఈ చిత్రం 15 రోజుల్లో దాదాపు రూ.284 కోట్లను రాబట్టింది. ఈ వారాంతానికి రూ.300 కోట్లు- వసూలు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. 'సైయారా' రెండో వారంలో 107.75 కోట్లను రాబట్టింది. బాలీవుడ్‌లో రెండో వారంలో అత్యధిక వసూళ్లు సాధించిన పదో చిత్రంగా నిలిచి రికార్డు సృష్టించింది. 'ది కశ్మీర్ ఫైల్స్' (రూ.108.97 కోట్లు-), 'దంగల్' (రూ.115.96 కోట్లు-), జవాన్ (రూ.125.46 కోట్లు-) చిత్రాలు 'సైయారా' కంటే ముందున్నాయి. మొదటివారంతో పోల్చుకుంటే.. రెండో వారంలో కలెక్షన్లు కాస్త తగ్గినప్పటికీ.. మూడోవారమూ విజయవంతంగా ప్రదర్శితమయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అజయ్‌దేవ్‌గణ్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2', సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్ర పోషించిన 'ధడక్ 2'కు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనే దక్కుతోంది. ఇది జులై 18న విడుదలైన 'సైయారా'కు కలిసివస్తోంది.



# చెప్పు తెగుద్ది..

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కపూరంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు- చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు- చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.